సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం ׀ 19 ׀ మార్చి ׀ 2023



చీనీ టన్ను రూ.32 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు పలికాయి. మార్కెట్‌కు 316 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.17
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.17, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.7.50 పలికింది.

గరిష్టం/కనిష్టం
35.7°/19.7°

జిల్లా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. శనివారం రోజంతా ఆకాశం మేఘావృతమైంది. ఉపరితల ఆవర్తనంతో సాయంత్రం నుంచి పలుచోట్ల వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షకు 637 మంది గైర్హాజర్



గోరంట్ల: ఎస్‌పీఎస్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రశాంతి నిలయం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 637 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 99 కేంద్రాల్లో 29,972 మంది విద్యార్థులకు గాను 29,335 మంది పరీక్షలు రాశారు. వీరిలో జనరల్ విద్యార్థులు 27,224 మందికి గాను 26,676 మంది హాజరు కాగా, 548 మంది గైర్హాజరయ్యారు. ఇక 2,748 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 2,659 మంది హాజరుకాగా, 89 మంది గైర్హాజరయ్యారు. గోరంట్ల ఎస్‌పీఎస్ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శనివారం కలెక్టర్ బసంత్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దంచేసిన వాన



ఏకపాదంపల్లిలో గాలివానకు నేలవాలిన అరటి చెట్టును చూపుతున్న రైతు

సాక్షి నెట్‌వర్క్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షానికి వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. శనివారం సాయంత్రం నుంచి పుట్టపర్తి, హిందూపురం, కదిరి, పెనుకొండ, ముదిగుబ్బ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో పెనుకొండ మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల ప్రహరీలు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. దాదాపు 100 ఎకరాల్లోని మొక్కజొన్న పంట దెబ్బతినింది. కొత్త చెరువు మండలంలోని పలు చోట్ల భారీ వృక్షాలు నేల కూలాయి. అక్కడక్కడా పంటలు దెబ్బతిన్నాయి. ఆయా ప్రాంతాల్లోని పలు కాలనీలో జలమయమయ్యాయి. హిందూపురం, పుట్టపర్తి పట్టణాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షం కురవడంతో పలు కాలనీలు జలమయమయ్యాయి. కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా మామిడి, నేరేడు చెట్లు దెబ్బతిన్నాయి. కాగా, రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షపాతం నమోదు కావచ్చన్నారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేలకొరిగిన అరటి తోట

తాడిమర్రి: గాలివాన బీభత్సానికి శనివారం మండలంలోని ఏకపాదంపల్లి గ్రామానికి చెందిన తుమ్మల విశ్వనాథ్‌కు చెందిన అరటి తోట పూర్తిగా దెబ్బతినింది. మరో పదిరోజుల్లో కోత కోయాల్సి ఉన్న దాదాపు 3000 అరటి చెట్లు నేలకొరిగాయి. దీంతో 4.లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు కన్నీటి పర్యంతమయ్యాడు.

దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: పట్టణంలోని ఆర్డీఓ ఆఫీసు పక్కన అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.నాగమణి కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ 2023–24కు సంబంధించి 5వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 24 వరకూ గడువు ఉందన్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈనెల 23న రాతపరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉత్కంఠకు తెర

- ఎట్టకేలకు తేలిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం
- 60 గంటల పాటు కొనసాగిన ఓట్ల లెక్కింపు
- పీడీఎఫ్ ఓట్లతో గట్టెక్కిన రామగోపాల్‌రెడ్డి
- తొలి ప్రాధాన్యతలో స్పష్టమైన మెజారిటీ వెన్నపూసకే..
- విజయావకాశాలను దెబ్బతీసిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు



రామగోపాల్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఉత్కంఠకు తెరపడింది. 60 గంటల సుదీర్ఘ కౌంటింగ్ అనంతరం ఎట్టకేలకు ఫలితం వెలువడింది. రెండో ప్రాధాన్యత ఓట్లు కలసిరావడంతో టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి విజయం సాధించారు. ఆయనకు 7,543 ఓట్ల మెజారిటీ లభించింది. తొలి ప్రాధాన్యత ఓట్లలో మెజారిటీ సాధించడమే కాకుండా.. రెండో ప్రాధాన్యతలోనూ ఆధిక్యంలో కొనసాగుతూ వచ్చిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి చివరి రౌండులో ఓటమి చవిచూశారు. రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా టీడీపీ అభ్యర్థికి వెళ్లడం, తనకు వచ్చిన ఓట్లలోనూ పెద్దసంఖ్యలో ఇన్‌వ్యాలిడ్ కావడం వెన్నపూస ఓటమికి కారణాలు.

పీడీఎఫ్ ఓట్లే గెలిపించాయి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ, పీడీఎఫ్ పరస్పర అవగాహనతో పనిచేశాయి. ముఖ్యంగా రెండో ప్రాధాన్యత ఓట్లను పరస్పరం బదిలీ చేసుకున్నారు. ఫలితంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గట్టెక్కగలిగారు. ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు 18వేల పైచిలుకు ఓట్లు లభించాయి. ఆయన ఎలిమినేషన్ సందర్భంగా రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించగా.. ఇందులో ఎక్కువగా టీడీపీ అభ్యర్థికే దక్కాయి. దీనివల్లే టీడీపీ గెలిచినట్టు స్పష్టమవుతోంది. బీజేపీ అభ్యర్థి నగరూరు రాఘవేంద్రకు వచ్చిన ఓట్లలోనూ రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా టీడీపీ అభ్యర్థికి వెళ్లాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేతిలో ఓడిపోతామన్న భయంతో టీడీపీ నాయకులు ముందే పీడీఎఫ్ నేతలను బతిమాలి మరీ అవగాహన పెట్టుకున్నారు. ఇది వారికి కలిసొచ్చింది.

వివాదాలు, దౌర్జన్యాల నడుమ..

కౌంటింగ్ కేంద్రంలో టీడీపీ నాయకులు అలజడి సృష్టించారు. ఆ పార్టీ ప్రధాన నాయకులు స్వతంత్ర అభ్యర్థులకు ఏజెంట్లుగా వచ్చి కౌంటింగ్ కేంద్రంలోనే తిష్ట వేశారు. కౌంటింగ్ ఆద్యంతం అక్కడున్న సిబ్బందిని సైతం భయభ్రాంతులకు గురిచేశారు. ఇదే క్రమంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి చెందిన ఓట్లు సైతం కొన్ని టీడీపీ కట్టల్లోకి వెళ్లినట్టు తేలింది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మొత్తం ఓట్లను రీకౌంటింగ్ చేయాలని పట్టుపట్టారు. కానీ ఆ బాక్సు వరకూ మాత్రమే కౌంట్ చేస్తామని, మొత్తం రీ కౌంటింగ్ కుదరదని అధికారులు చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలో అక్రమాలపై అభ్యర్థి వెన్నపూసతో పాటు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. ఇందుకు నిరసనగా వెన్నపూస, విశ్వ కౌంటింగ్ కేంద్రం వద్ద కొద్దిసేపు ఆందోళన చేపట్టారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

సుదీర్ఘంగా కొనసాగిన ప్రక్రియ

ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగింది. ఈ నెల 16వ తేదీ ఉదయం 8 గంటలకు మొదలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ 18వ తేదీ రాత్రి 8 గంటలకు ముగిసింది. మూడు రోజుల పాటు బ్యాలెట్ బాక్సుల మధ్య ఉద్యోగులు, పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు గడిపారు. తొలి రోజు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నువ్వా నేనా అంటూ ఊరించగా.. రెండో రోజు, మూడవ రోజు పట్టభద్రుల ఓట్ల లెక్కింపు, ఫలితాల సరళి నరాలు బిగుసుకుపోయేలా చేశాయి. ప్రధాన రాజకీయ పార్టీల అభిమానులు టీవీల ముందు అతుక్కుపోయారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్య మెజారిటీ తక్కువగా నమోదు కావడంతో ఏ రౌండులో ఏమవుతుందోనన్న ఉత్కంఠ కొనసాగింది.



జేఎన్‌టీయూ(ఏ) కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

షిఫ్టుల వారీగా విధులు

ఓట్ల లెక్కింపు సందర్భంగా 200 మంది రెవెన్యూ సిబ్బంది, మరో 200 మందికి పైగా పోలీస్ సిబ్బంది మూడు షిఫ్టులుగా పనిచేశారు. కలెక్టర్‌తో పాటు ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. 12 మంది టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు పోలైన 25 వేల పై చిలుకు ఓట్లు, 49 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులకు పోలైన 2.45 లక్షల ఓట్లను రాత్రింబవళ్లు లెక్కించారు.

మిశ్రమ ఫలితాలు

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. టీచర్స్ ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి గెలుపొందగా, పట్టభద్రుల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి రామగోపాల్‌రెడ్డి గెలుపొందారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయడం వైఎస్సార్‌సీపీకిదే తొలిసారి. పోటీ చేసిన తొలిసారే బోణీ కొట్టడం విశేషం.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన అభ్యర్థులకు వచ్చిన తొలిప్రాధాన్యత ఓట్లు

అభ్యర్థి	ఓట్లు
వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ)	95,969
బి.రామగోపాల్‌రెడ్డి (టీడీపీ)	94,149
ఎన్.రాఘవేంద్ర (బీజేపీ)	7,412
పోతుల నాగరాజు (పీడీఎఫ్)	18,758
కమ్మూరు నాగరాజు (స్వతంత్ర)	1,632

'రెండో ప్రాధాన్యత' లెక్కింపు తర్వాత అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

బి.రామగోపాల్‌రెడ్డి (టీడీపీ)	1,09,781
వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ)	1,02,238
మెజారిటీ	7,543

పోలైన మొత్తం గ్రాడ్యుయేట్ ఓట్లు
2,45,687

చెల్లని ఓట్లు
19,239

చెల్లిన ఓట్లు
2,26,448

ఎన్నికల ప్రక్రియ పూర్తి

- అధికారులు, సిబ్బంది, పోలీసులకు కలెక్టర్ అభినందనలు



కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో పరిశీలకులు పోలా భాస్కర్

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల ఆర్‌ఓ, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. జేఎన్‌టీయూఏ కళాశాలలో పట్టభద్రుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ శనివారం ముగిసిన తరువాత పరిశీలకులు పోలా భాస్కర్‌తో కలిసి ఆమె మాట్లాడారు. అందరి సహకారంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా ముగిసిందన్నారు. శాసన మండలి ఎన్నికలు విజయవంతం కోసం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేవరకు సహకరించిన ఎన్నికల అధికారులు, సిబ్బందికి, పటిష్టమైన బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవి పాల్గొన్నారు.

అశ్రునయనాలు.. ఆర్తనాదాలు

- ధర్మవరం ఆస్పత్రి మార్చురీ వద్ద మిన్నంటిన రోదనలు
- పోట్లమర్రి ప్రమాద మృతులకు పోస్టుమార్టం పూర్తి
- మృతుల కుటుంబీకుల రోదనలతో దద్దరిల్లిన ఆస్పత్రి



ధర్మవరం ఆస్పత్రి మార్చురీ వద్ద రోదిస్తున్న దాసరి ఈశ్వరయ్య భార్య లక్ష్మీదేవి

ధర్మవరం అర్బన్: 'మమ్మల్ని ఇట్టా వదిలి వెళ్తే మేమెట్టా బతికేదయ్యా...మేమేం పాపం చేసినం దేవుడా...మాకెందుకింత శిక్ష వేశావయ్యా...గంటలో ఇంటికొస్తానన్న మనిషిని...ఇట్టా ఆస్పత్రిలో పడుకోబెట్టావే...నీకిది న్యాయమా...మా పిల్లల పరిస్థితి ఏం గాను..'' అంటూ పోట్లమర్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాద మృతుల కుటుంబీకుల ఆర్తనాదాలతో ధర్మవరం ఆస్పత్రి ప్రాంగణం దద్దరిల్లింది. బత్తలపల్లి మండలం పోట్లమర్రి వద్ద శుక్రవారం రాత్రి బొలెరో, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో మొత్తం ఆరుగురు మృత్యువాత పడగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను శుక్రవారం రాత్రే ఆస్పత్రిలోని మార్చురీకి తీసుకువచ్చారు. శనివారం ఉదయం పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబీకులకు అప్పగించారు. ఈ సందర్భంగా తమ వారిని తలచుకుని మృతుల కుటుంబీకులు, బంధువులు రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. ఆప్తులు కోల్పోయిన వారి ఆర్తనాదాలతో ఆస్పత్రి ప్రాంగణం మార్మోగింది.

రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

ధర్మవరం: పోట్లమర్రి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదం గురించి తెలియగానే సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అంతకుముందు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆరుగురు మృతుల కుటుంబాల వివరాలను తెలుసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆదుకోవాలని కోరారు. స్పందించిన సీఎం.. రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రస్తుతం అధికారులు చెక్కులను సిద్ధం చేస్తున్నారు. త్వరలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నేరుగా వెళ్లి బాధిత కుటుంబాలకు ఆ చెక్కులను అందించనున్నారు.

చికెన్ తీసుకుని ఇంటికి వెళ్తూ...



బత్తల మల్లేష్(ఫైల్)

బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామానికి చెందిన బత్తల మల్లేష్... వేల్పుమడుగు వద్దనున్న రీలింగ్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని బత్తలపల్లికి వచ్చిన మల్లేష్ చికెన్ తీసుకుని స్వగ్రామమైన పోట్లమర్రికి ఆటోలో వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతునికి భార్య నాగేంద్రమ్మ, కుమార్తెలు పుష్పలత, శిరీష ఉన్నారు. కుటుంబ యజమాని దూరం కాగా...ఇద్దరి బిడ్డల భవితను తలచుకుని మల్లేష్ భార్య నాగేంద్రమ్మ శోకసంద్రంలో మునిగిపోయింది.

కాసేపట్లో ఇంటికి చేరుకుంటాడనగా...

ధర్మవరం శాంతినగర్‌కు చెందిన హాజీపీరా బత్తలపల్లిలోని చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం పనిముగించుకుని ధర్మవరానికి వచ్చేందుకు ఆటో ఎక్కాడు. కాసేపట్లో ఇంటికి చేరుకుంటానని అనుకున్న తరుణంలోనే మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో కబళించింది. మృతునికి భార్య నూర్జహాన్, ఇద్దరు పిల్లలు షాకీర్, హాజీవలి ఉన్నారు.



హాజీపీరా(ఫైల్)

శుభకార్యానికి కుమార్తెతో వెళ్లి వస్తూ...



మహమ్మద్ ఫయాజ్(ఫైల్)

ధర్మవరం రాజేంద్రనగర్‌కు చెందిన మహమ్మద్ ఫయాజ్ పోతుకుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద కూల్‌డ్రింక్స్ దుకాణం నడుపుతున్నాడు. బంధువుల ఇంట్లో శుభకార్యానికి తన ఆరేళ్ల కుమార్తె షాహిస్తాతో కలిసి కదిరి వెళ్లాడు. శుక్రవారం రాత్రి తిరిగి ధర్మవరం వచ్చేందుకు బత్తలపల్లిలో ఆటో ఎక్కాడు. మరికాసేపట్లో ఇంటికి చేరుకోవాల్సిన ఆయన.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. చిన్నారి షాహిస్తా తీవ్రంగా గాయపడి ప్రస్తుతం అనంతపురం సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మృతునికి భార్య షాహినాభాను, ఇద్దరు పిల్లలున్నారు.

తాడిపత్రికి వెళ్లకుండా ఇంటికివెళ్తూ...

గొట్లూరుకు చెందిన దాసరి ఈశ్వరయ్య గొర్రెల కాపరి. తాడిపత్రిలో గొర్రెలను మేపే కూలి పనికి కుదిరాడు. శుక్రవారం రాత్రి తాడిపత్రికి వెళ్లేందుకు బత్తలపల్లికి వెళ్లాడు. బస్సు ఎంతసేపటికీ రాకపోవడంతో తిరిగి గొట్లూరుకు ఆటోలో బయలు దేరి మృత్యువాత పడ్డాడు. మృతునికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



దాసరి ఈశ్వరయ్య(ఫైల్)

అరగంటలో వస్తానని ... పరలోకాలకు

ధర్మవరం కేతిరెడ్డికాలనీకి చెందిన తనేరు నరసింహులు ఆటో డ్రైవర్. శుక్రవారం రాత్రి బత్తలపల్లిలో ప్రయాణికులను ఎక్కించుకుని ధర్మవరం బయలుదేరాడు. అరగంటలో వస్తానని ఇంటికి ఫోన్ చేసి చెప్పాడు. అంతలోనే రోడ్డు ప్రమాదంలో నరసింహులు మృతి చెందాడు. మృతునికి భార్య నాగమునీశ్వరి, కుమార్తెలు అమూల్య, అనూష, కుమారుడు సత్యలింగేశ్వర్ ఉన్నారు. నరసింహులు మృత్యువాత పడటంతో ఆ కుటుంబ పరిస్థితి ప్రశ్నార్థకమైంది.



నరసింహులు(ఫైల్)

కుమారుడికి వైద్యం చేయించి వెళ్తూ...

నల్లాయకుంటపల్లి గ్రామానికి చెందిన గాలి నారాయణస్వామి ధర్మవరం కేశవనగర్‌లో ఉంటూ ఖాదీబండార్ సొసైటీలో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కుమారుడు నాగార్జునకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో ముదిగుబ్బకు వెళ్లి వైద్యం చేయించి తిరిగి ధర్మవరానికి వచ్చేందుకు బత్తలపల్లిలో ఆటో ఎక్కి ప్రమాదంలో మృతి చెందాడు. మృతునికి భార్య కేశమ్మ, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.



నారాయణస్వామి(ఫైల్)

నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణాలు బలి

బత్తలపల్లి: పోట్లమర్రి సమీపంలో శుక్రవారం రాత్రి బొలెరో వాహనం, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదానికి ఆటో డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన మేరకు... శుక్రవారం రాత్రి ధర్మవరానికి చెందిన ఆటో డ్రైవర్ తన్నేరు నరసింహులు(55) బత్తలపల్లిలో ప్రయాణికుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో పోట్లమర్రికి చెందిన బత్తల మల్లేసు(48), ఓబుళాపురానికి చెందిన హాజీపీరా(50), నల్లాయకుంటపల్లికి చెందిన నారాయణస్వామి(60), గొట్లూరుకు చెందిన దాసరి ఈశ్వరయ్య(40), ధర్మవరం రాజేంద్రనగర్‌కు చెందిన ఫయాజ్(50) తన ఎనిమిదేళ్ల కుమార్తె షాహిస్తా, గొట్లూరుకు చెందిన రంగస్వామి మొత్తం ఏడుగురు ఆటో ఎక్కారు. మరికొంత మంది ప్రయాణికుల కోసం చూస్తున్న ఆటో డ్రైవర్ నరసింహులు ఎదురుచూస్తుండగా.. వెళ్లాలంటూ ప్రయాణికులు ఒత్తిడి చేశారు. దీంతో బలవంతంగా బయలుదేరిన అతను.. 'ఇంకొంతమంది ఎక్కింటే సరిపోవు' అంటుంటే ఆటోలో ప్రయాణిస్తున్న రంగస్వామి 'ఇంకా చాలరా.... ఇంతమంది' అని అన్నాడు. దీంతో 'ఎవరు మాట్లాడింది' అంటూ డ్రైవర్ వెనక్కు చూశాడు. దీంతో 'ముందుకు చూడు గుద్దుతావ్' అంటుండగానే ఆటో స్టీరింగ్ కుడిపక్కకు తిరగడం, అదే సమయంలో ఎదురుగా బొలెరో వాహనం రావడంతో రెండూ వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఫయాజ్, షాహిస్తా, రంగస్వామితో పాటు తాడిమర్రి మండలం నార్శింపల్లి గ్రామానికి చెందిన బొలెరో డ్రైవర్ నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఫయాజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, ఆయన కుమార్తె షాహిస్తా పరిస్థితి విషమంగా ఉండగా, చిన్నారితో పాటు మిగతా ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

క్లుప్తంగా

సూపర్‌వాస్మోల్ తాగి వృద్ధురాలి ఆత్మహత్య


మృతి చెందిన లక్ష్మీదేవి

బత్తలపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రాఘవంపల్లిలో శనివారం జరిగింది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన కూనమనేని లక్ష్మీదేవి (75), వెంకటేష్ దంపతులు. 6 నెలలుగా లక్ష్మీదేవి తీవ్రమైన దగ్గు, అస్తమాతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూపర్‌వాస్మోల్ తాగింది. కుటుంబసభ్యులు వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఖాద్రీశుని ఆలయానికి భక్తుల తాకిడి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కర్ణాటక, కడప, చిత్తూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. తీర్థప్రసాదాలు అందించి, అన్నదానం చేశారు. ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

కాళ్లపారాణి ఆరకనే కాటికి..

- నవవధువు అనుమానాస్పద మృతి
- కట్టుకున్నోడే చంపాడని బంధువుల ఆరోపణ

పెళ్లి సందడి, తీపి జ్ఞాపకాల్లోంచి బంధువులు, ఆత్మీయులు ఇంకా బయటకు రానేలేదు. పెళ్లై పట్టుమని వారం రోజులు కూడా గడవలేదు. కట్టుకున్న భర్తతో మూడు రోజులు కలసి లేదు. ఏం కష్టమొచ్చిందో కూడా ఎవరికీ అర్థం కావడం లేదు.. ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్న ఓ యువతి అయినవాళ్లను శోకసంద్రంలోకి నెట్టింది. శుభకార్యం ఘనంగా జరగడంతో మొక్కు తీర్చుకుందామని తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధికి వెళ్లిన తల్లిదండ్రులు పిడుగులాంటి వార్త విని హతాశులయ్యారు. హుటాహుటిన ఘటనాస్థలం చేరుకుని కుమార్తె మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదించారు.

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కాళ్ల పారాణి కూడా అరకముందే ఓ నవ వధువు అనుమానాస్పద రీతిలో మరణించింది. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన మేరకు.. బళ్లారి జిల్లా కూడ్లిగి తాలూకా చిరుమనెహళ్లికి చెందిన శశికళ (20) స్థానిక ఐరన్ బ్రిడ్జి వద్ద ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయంలో పనిచేసేది. నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసే ఆత్మకూరు మండలం పంపనూరు తండాకు చెందిన రమేష్ నాయక్‌తో ఈ నెల 12న ఈమెకు వివాహం జరిగింది. 13న కొత్త దంపతులు శశికళ పుట్టింటికి వెళ్లారు. 14న అనంతపురం వచ్చారు. ఇల్లు ఇంకా ఎక్కడా సరిపోలేదని రెండు రోజులు శశికళను హాస్టల్‌లో ఉంచిన రమేష్‌నాయక్ 16వ తేదీన నాల్గవరోడ్డు సమీపంలోని ఎస్‌వీఎస్ఆర్ అపార్టుమెంటుకు తీసుకెళ్లాడు. ఏం జరిగిందో తెలియదు గాని మరుసటి రోజు అంటే 17వ తేదీ రాత్రి శశికళ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది.

భర్త ప్రవర్తనపై అనుమానాలు..

కొత్త దంపతులు ఇంట్లో ఇద్దరే ఉంటున్నారు. శుక్రవారం రాత్రి శశికళకు, ఆమె భర్త రమేష్‌నాయక్ మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే శశికళ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఘర్షణ జరిగిన కొద్దిసేపటికే తనను లోపలి గదిలో పెట్టి బయట తలుపులకు శశికళ తాళం వేసినట్లు రమేష్‌నాయక్ చెబుతున్నాడు. బయట వాళ్ల సాయం కోసం గట్టిగా కేకలు వేస్తే వచ్చి తలుపులు విరగ్గొట్టారని తెలిపాడు. అయితే, అపార్ట్‌మెంట్‌లోని రెండో ఫ్లోర్‌లోకి వచ్చి తలుపులు తీసిన వారెవరో చెప్పడంలేదు. పైగా శశికళ ఫ్యాన్‌కు ఉరి వేసుకునేందుకు ఎత్తు కోసం ఎలాంటి కుర్చీగాని ఉపయోగించలేదు. ఇంత జరిగినా శశికళ కుటుంబ సభ్యులకు శనివారం ఉదయం 10.30 వరకు సమాచారం ఇవ్వలేదు. 11 గంటల సమయంలో ఫోన్ చేసి మీ పాప ఉరివేసుకుంది, కొన ఊపిరితో ఉందని ఆస్పత్రికి తీసుకెళుతున్నామని చెప్పాడు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో శశికళ చనిపోయిందని తెలిపాడు. పోలీసులకు కూడా ఉదయం 10.30 వరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దీంతో రమేష్ ప్రవర్తనపై బాధిత కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న సీఐ కత్తి శ్రీనివాసులు, శశికళ, రమేష్‌నాయక్ పెళ్లినాటి ఫొటో

హతమార్చాడని ఆరోపణ

రమేష్‌నాయక్ వ్యవహారంపై శశికళకు అనుమానం వచ్చినట్లు తెలుస్తోంది. అతనికి మరొకరితో సంబంధాలున్నాయిని, ఈ విషయం తెలియడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతోనే ఆమెను హతమార్చి ఉండవచ్చని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

కన్నీరు మున్నీరైన కన్నవారు..

నాలుగురోజుల క్రితం నవ్వుతూ అత్తారింటికి వెళ్లొస్తానని చెప్పిన కూతురిని గుర్తు చేసుకుని తండ్రి ఠాగూ ర్‌నాయక్ రోదించిన తీరు అందరినీ కలచి వేసింది. ఠాగూరునాయక్‌ది అతి పెద్ద కుటుంబం. ఏడుగురు అన్నదమ్ములు. అంతా కలిసే ఉంటున్నారు. ఠాగూర్ నాయక్‌కి ఐదుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు. అందరిలో చిన్నదైన శశికళంటే ఆ కుటుంబానికి చాలా ఇష్టం. ''తిరుమల వెంకన్న స్వామి దయతో బిడ్డ పెళ్లి బాగా జరిపించానని సంబరపడ్డా. నా బాధ్యత సంతృప్తిగా తీర్చుకోవడానికి తిరుమల వేంకటేశ్వరస్వామి దయేనని తలచి మొక్కు తీర్చుకునేందుకు 16వ తేదీ భార్య జయబాయితో కలిసి వెళ్లా. తీరా ఉదయం ఫోన్ చేసి బిడ్డ చనిపోయిందని చెప్పారు'' అంటూ ఆయన విలపించిన తీరు కన్నీరుపెట్టించింది.

అక్కకు బంగారం ఇద్దామని..

శశికళ తమ్ముడు, వైద్య విద్యార్థి అయిన విశ్వనాథ్ నాయక్ శనివారం ఉదయం అనంతపురం రావాల్సి ఉంది. 'ఈ విషయంపై నిన్న అక్కతో మాట్లాడా. రేపు మా ఇంటికి వస్తావా? అని పిలిచింది. ఉదయాన్నే అక్కబావ వద్దకు వెళ్లాలని ఎంతో సంతోషపడ్డా. ఇంతలో ఇలా జరిగిపోయిందంటూ సోదరుడు కూడా గుండెలవిసేలా రోదించాడు.

కేసు నమోదు: త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. బిడ్డ చావుకు అల్లుడే కారణమని బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- డీఆర్‌డీఏ పీడీ నరసయ్య


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

హిందూపురం టౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. శనివారం స్థానిక వీవర్స్ కాలనీలోని శ్రీనివాస, శ్రీబాలాజీ గ్రామైక్య సంఘాలను ఆయన సందర్శించారు. వైఎస్సార్ ఆసరా మూడో విడతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ లబ్ధితో మహిళలు ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా మహిళలకే లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. రుణాలను ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకోవాలన్నారు. సమావేశంలో ఫైనాన్స్ డీపీఎం రామిరెడ్డి, డీపీఎం రామ్మోహన్, డీపీఎం నాగరాజు, ఏపీఎం రామకృష్ణ, పీడీ సీసీ ఆంజనేయులు, సీసీలు, ఎల్‌సీలు, వీఓఏలు, సభ్యులు పాల్గొన్నారు.

ఆరుగురు విద్యార్థుల డీబార్

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ 6 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలో నలుగురు, కదిరిలో ఇద్దరు విద్యార్థులను డీబార్ చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రొళ్ల: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఆవినకుంట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు గ్రామంలో రోడ్డుపై విద్యుత్ లైన్ తెగి పడింది. ఈ విషయం గమనించని గ్రామానికి చెందిన వీరభద్రేగౌడు (41) రోడ్డుపై నడిచి వెళ్తూ వైరుపై కాలు పెట్టడంతో షాక్ కొట్టింది. స్పృహ కోల్పోయిన ఆయనను స్థానికులు రొళ్ల సీహెచ్‌సీకి తరలించగా.. నర్సులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా, వీరభద్రేగౌడును సకాలంలోనే ఆస్పత్రికి తీసుకొచ్చామని, డాక్టర్లు అందుబాటులో ఉండి ప్రథమ చికిత్స చేసి ఉంటే బతికేవాడని గ్రామస్తులు ఆరోపించారు. మృతుని తండ్రి భోజేగౌడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.


వీరభద్రేగౌడు మృతదేహం

అల్లుడిపై కొడవలితో మామ దాడి

- కుమార్తెను వేధిస్తున్నాడని ఆగ్రహం

పెనుకొండ రూరల్: కుమార్తెను వేధిస్తున్నాడని అల్లుడిపై కొడవలితో మామ దాడి చేశాడు. పెనుకొండ మండలం అమ్మవారిపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకొంది. బాధితుని తల్లి షేక్ ఫక్రున్నీషా వివరాల మేరకు.. చిలమత్తూరుకు చెందిన ఫకృద్దీన్ కుమార్తె నసీమా భానుతో ఆమె పెద్ద కుమారుడు రియాజ్‌కు ఏడాది క్రితం వివాహం జరిగింది. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఇదే క్రమంలో శుక్రవారం సాయంత్రం గొడవ జరగ్గా నసీమా భాను తండ్రికి ఫోన్ ద్వారా తెలియజేసింది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో అమ్మవారిపల్లికి చేరుకున్న ఫకృద్దీన్ తన అల్లుడిని బయటకు రమ్మని పిలిచాడు. వెంట తెచ్చుకొన్న కొడవలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రియాజ్‌ను హుటాహుటిన గుట్టూరు ప్రభుత్వ వైద్యశాలకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలు తీసుకెళ్లారు. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేశారు.


తీవ్రంగా గాయపడిన రియాజ్

సరిహద్దుల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- కలెక్టర్ బసంత్‌కుమార్
- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అంతర్ రాష్ట్ర అధికారుల భేటీ


మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ బసంత్‌కుమార్ కర్ణాటక రాష్ట్ర అధికారులకు వివరించారు. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో శనివారం చిలమత్తూరు చెక్‌పోస్ట్ సమీపంలోని 'రక్షా' అకాడమీలో ఇరు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లోని జిల్లా అధికారులు, రవాణ, ఎక్సైజ్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై తుమకూరు, చిక్‌బల్లాపూర్ ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో చిక్‌బల్లాపూర్ కలెక్టర్ ఎన్ఎం నాగరాజు, తుముకూరు కలెక్టర్ వైఎస్ పాటిల్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీష్, ఎస్పీలు నగేష్, రాహుల్ కుమార్, రాహుల్ దేవ్ సింగ్, హర్షవర్ధన్ రాజు, సీఈఓలు ప్రకాష్, విద్యాకుమారి, తదితర ఉన్నత స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్ర ఎన్నికల అధికారులు మాట్లాడుతూ... త్వరలో కర్ణాటకలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలు చేసేందుకు సరిహద్దు జిల్లాల అధికారుల సహకరించాలన్నారు. కలెక్టర్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ... కర్ణాటక రాష్ట్రానికి శ్రీసత్యసాయి జిల్లాలో 15 మండలాలు సరిహద్దుల్లో ఉన్నాయన్నారు. ప్రతి మండలంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి గట్టి భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. హిందూపురం, చిలమత్తూరు, అమడగూరు, లేపాక్షి మండలాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు. వాహన తనిఖీలు ముమ్మరం చేస్తామని తెలిపారు. ఆయా జిల్లాల ఎస్పీలు మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ చేతన్, జిల్లాలోని ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల

- 32,909 మంది తల్లుల ఖాతాల్లో జమ కానున్న రూ.22.85 కోట్లు

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా ఆర్థిక స్థోమత లేక ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న ఉన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న విద్యా దీవెన పథకానికి శ్రీకారం చుట్టారు. పేద విద్యార్థులందరికీ పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, కాపు తదితర కులాలకు చెందిన పేద విద్యార్థుల తల్లుల ఖాతాలకే డబ్బు జమ చేస్తున్నారు. విద్యా సంవత్సరంలో నాలుగు విడతలుగా నగదు అందనుండగా.. ఈ ఏడాది మొదటి విడతగా నగదు జమచేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఎన్టీఆర్ జిల్లా తిరువూర్‌లో ఆదివారం జరగనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి జిల్లాలోని 32,909 మంది తల్లుల ఖాతాల్లో రూ.22.85 కోట్లు జమచేస్తారు.

దివ్యాంగ చిన్నారులకు ప్రత్యేక శిబిరాలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని దివ్యాంగ చిన్నారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు భవిత కేంద్రాల జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఈనెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ఎంపిక చేసిన మండలాల్లోని భవిత కేంద్రాల్లో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో 6– 16 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వారికి పరికరాలు సైతం అందజేస్తామన్నారు. ఐఈఆర్టీలు, ఎంఈఓలు ఆయా మండలాల్లోని దివ్యాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులకు శిబిరాల గురించి తెలియజేయాలన్నారు.

షెడ్యూల్ ఇలా..

- **20వ తేదీ:** ధర్మవరం భవిత కేంద్రంలో ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, రామగిరి, చెన్నేకొత్తపల్లి కనగానపల్లి మండలాల దివ్యాంగ పిల్లలు పాల్గొనాలి.
- **21వ తేదీ:** కదిరి భవిత కేంద్రంలో కదిరి, ఓడీసీ, ఎన్‌పీ కుంట, నల్లచెరువు, గాండ్లపెంట, తనకల్లు, తలుపుల, అమడగూరు మండలాల పిల్లల కోసం క్యాంపు ఏర్పాటు
- **23వ తేదీ:** హిందూపురం భవిత కేంద్రంలో హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పెనుకొండ, సోమందేపల్లి, పరిగి మండలాల వారు పాల్గొనవచ్చు.
- **24వ తేదీ:** మడకశిర భవిత కేంద్రంలో మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం, రొద్దం మండలాల పిల్లలకు అవకాశం ఉంటుంది.
- **25వ తేదీ:** పుట్టపర్తి భవిత కేంద్రంలో గోరంట్ల, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, పుట్టపర్తి, ముదిగుబ్బ మండలాల పిల్లలు పాల్గొనాలి.



సీఎంను కలసిన రమేష్‌గౌడ్

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీ అనుబంధ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ శనివారం అమరావతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు.